క్లుప్తంగా

నేడు ప్రజా ఫిర్యాదుల వేదిక రద్దు

తిరుపతి తుడా: ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక, డయల్ యువర్ కమిషనర్ దీపావళి పర్వదినం సందర్భంగా రద్దు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

టపాసుల దుకాణాల భద్రతా తనిఖీ

భాకరాపేట: దీపావళి వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో టపాసుల దుకాణాల్లో భద్రతా చర్యలను ఎస్ఐ రాఘవేంద్ర పరిశీలించారు. టపాసుల నిల్వ, అగ్నిమాపక పరికరాల అమరిక, భద్రతా దూరం వంటి అంశాలను పరిశీలించి వ్యాపారులకు సూచనలు ఇచ్చారు. ప్రజల ప్రాణ, ఆస్తి భద్రత దృష్ట్యా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. అలాగే లైసెన్స్ లేని టపాసుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్రాకర్స్ విక్రయాలపై ఆర్డీఓ ఆర్డర్ బాధాకరం

తిరుపతి కల్చరల్: దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 17 నుంచి 19వ వరకు మూడు రోజులు మాత్రమే టపాకాయలు విక్రయించాలని తిరుపతి ఆర్డీఓ ఆర్డర్ ఇవ్వడం బాధాకరమని, ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కిరణ్ తెలిపారు. ఆదివారం ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంప్రదాయబద్ధంగా ఈనెల 19, 20, 21 తేదీల్లో నరకచతుర్దశి, దీపావళి వేడుకలను ప్రజలు జరుపుకుంటున్నారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వంలో కొందరు అధికారులు ప్రభుత్వం ఇచ్చిన దీపావళి సెలవులను బేఖాతరు చేస్తూ ఇందుకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని అన్నారు. పండుగ రోజున టపాకాయలు విక్రయించడానికి వీలు లేకుండా తిరుపతి ఆర్డీఓ ఆర్డర్ ఇవ్వడం దారుణమన్నారు. టపాకాయల విక్రయాలపై ఆర్డీవో ఇచ్చిన ఆర్డర్ను వెంటనే వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా కోతకాలపు పండుగ

పాకాల : స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం కోతకాలపు పండుగ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఏటా పంటలు చేతికి వచ్చే సందర్భాన్ని పురస్కరించుకుని ఈ పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 8 గంటలకు ప్రత్యేక ఆరాధన అనంతరం రాత్రి వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. రెవరెంట్ ప్రేమ్కుమార్ వాక్యసందేశం ఇచ్చారు. పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్కుమార్ చర్చికి విచ్చేసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ రాఘవేలు, కోశాధికారి అరుల్సెల్వి, వివిధ కమిటీల కన్వీనర్లు, వివిధ ప్రాంతాల క్రైస్తవులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

ముద్దుగారె యశోద



చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం బెంగళూరుకు చెందిన అవిఘ్న అభ్యాస ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నాట్య గురువు హరిప్రియ పెట్టం నేతృత్వంలో కళాకారుల భరతనాట్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

పండుగకొస్తే.. ప్రాణాల మీదకొచ్చే..

- దీపావళికి వచ్చిన వారికి స్వాగతం పలుకుతున్న గుంతల రోడ్లు
- కుంటలను తలపిస్తున్న అప్పపల్లి-రాయలచెరువు ప్రధాన రహదారి
- ఒకటిన్నర సంవత్సరం దాటినా రోడ్లకు మరమ్మతులు చేయని కూటమి ప్రభుత్వం

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులు కుంటలను తలపిస్తున్నాయి. రోడ్లపై వెళ్లేటప్పుడు అక్కడ ఉన్నది మడుగా.. లేక రోడ్డా అనేది తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయలచెరువు నుంచి అనుప్పల్లి వరకు, సుమారు 60 గ్రామాల వరకు ఇదే రహదారి.

– తిరుపతి తుడా/చంద్రగిరి/రామచంద్రాపురం

చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు నుంచి ఎర్రావారిపాళెం మండలానికి వెళ్లే ప్రధాన రహదారిలో చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓ కార్యాలయం ముందు తటాకాన్ని తలపించేలా రోడ్డుపై నిలిచిన నీరు. ఈ మార్గం గుండా నిత్యం పది గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. పండుగల వేళ వాహన దారులకు కష్టాలు తప్పడం లేదు. – **భాకరాపేట**

చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం అనుప్పల్లి నుంచి రాయలచెరువుకు వెళ్లే మార్గంలో నూతి గుంటపల్లి వద్ద చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి



కుప్పం బాదూరు హైస్కూల్ వద్ద గుంతలమయమైన తారు రోడ్డు

కోతకు గురైంది..

ఇటీవల వరుసగా పడుతున్న వర్షాలకు కోతకు గురైన రుయా ఆసుపత్రి రహదారి, నర్సింగ్ కళాశాలకు వెళ్లే రహదారితో పాటు పరిసర ప్రాంతాల రోడ్లు వర్షపు నీటి ప్రవాహానికి పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్డు కోతకు గురి కావడంతో పాదాచారులతో పాటు వాహనదారుల సైతం ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నర్సింగ్ స్టూడెంట్స్ వార్డుల నుంచి హాస్టల్కు వెళ్లే క్రమంలో ఎక్కడ పడతామో అన్న భయంతో అడుగులో అడుగేసుకుంటూ వెళుతున్నారు. స్థానిక సుబ్బారెడ్డి నగర్లోని పలు వీధులు వర్షం దాటికి అస్తవ్యస్తంగా మారాయి. తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుల్ల తేలిపోయింది. ఈ క్రమంలో రోడ్డుపై పెద్దగోతులు ఏర్పడ్డాయి.

ఆధ్యాత్మిక గుంతల నగరం

తిరుపతిలోని పలు రహదారులు వర్షానికి దెబ్బతిన్నాయి. తారు రోడ్లు సైతం పూర్తిగా ధ్వంసమై గుల్ల తేలిపోయి గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, ముఖ్యంగా పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బైరాగిపట్టెడ, గాంధీపురం, పళని థియేటర్ పరిసర ప్రాంతాలు, రాయల్ నగర్, ఎంఆర్ పల్లి, ఎస్టీవీ నగర్, డీఆర్ మహల్ వెనుక పరిసర ప్రాంతాలు, వెంకటేశ్వర థియేటర్ రోడ్డు, లక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఆటోనగర్లో చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. ఇక్కడ ప్రతి పది అడుగులకు ఒక గోతు ఏర్పడింది.









రేణిగుంట మండలం గుత్తివారిపల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో వెళ్తున్న గ్రామస్తులు, రుయా ఆస్పత్రి సమీపంలో, సుబ్బారెడ్డి నగర్లో.., అన్నారావు సర్కిల్లో రోడ్డుపైనే గుంత

మా నాయకుడు వచ్చినప్పుడే దీపావళి

గత కొన్నేళ్లుగా చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ పండుగ ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో చెవిరెడ్డి దీపావళి కానుక పంపించేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక చెవిరెడ్డి కుటుంబంపై కక్ష కట్టింది. అక్రమ లిక్కర్ కేసులో ఆయనను ఇరికించి 125 రోజులుగా జైలులో పెట్టించింది. రాజకీయాలకు అతీతంగా అందరికీ పండుగ వేళ కానుకలు పంపించే చెవిరెడ్డి లేనిలోటు ఈసారి స్పష్టంగా కనిపిస్తోందంటున్నారు. తమ నాయకుడు వచ్చాకే పండుగ చేసుకుంటామని చెబుతున్నారు.

– తిరుపతి రూరల్



మాజీ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా దీపావళి కానుకలను అందిస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి(ఫైల్)

భాస్కరన్న వచ్చినప్పుడే మాకు దీపావళి



దీపావళి పండుగకు భాస్కర్ అన్న పంపించే కానుకలు, ఆయన అందించే ఆశీస్సులు మాకు ఆనందాన్ని ఇచ్చేవి. ఈసారి పండుగకు ఆయనను మా నుంచి దూరం చేశారు. ఆయన ఎప్పుడు మా దగ్గరకు వస్తారో అప్పుడే మాకు నిజమైన దీపావళి.

– యశోదమ్మ, వైస్ ఎంపీపీ, తిరుపతి రూరల్

పండుగ చేసుకోవాలని లేదు



మా నాయకుడు భాస్కర్రెడ్డిని అక్రమ కేసుల్లో ఇరికించి అష్టకష్టాలు పెడుతుంటే మాకు పండుగ ఎలా చేసుకోవాలనిపిస్తుంది. దీపావళికి మా ఇంటి ముందుకు చెవిరెడ్డి కానుక వస్తేనే గుర్తుకు వస్తుంది.

– భారతి, సర్పంచ్, సి.మల్లవరం

మా పొలం కాపాడండి

తిరుపతి కల్చరల్: తమకు జీవనాధారమైన పొలాన్ని తహసీల్దార్తో కుమ్మక్కై రికార్డులను మార్పు చేసే భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న కబ్జాదారుడిపై చర్యలు తీసుకుని, మాకు న్యాయం చేయాలని శ్రీకాళహస్తికి చెందిన భూ బాధితులు పాండురంగ, తల్లి అనసూయమ్మ ప్రభుత్వాధికారులను వేడుకున్నారు. ఆదివారం ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఎస్ కండ్రిగ మండల పరిధిలోని పల్లమాల గ్రామం లెక్క దాఖలా సర్వేనంబర్ 79/3లో 91వ ఖాతా సంఖ్యలోని ఐదు ఎకరాల డీకేటీ భూమిని 2011లో బూదూరు గోవిందమ్మ నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. తమ భూమికి 2019 పాస్ పుస్తకాలు కూడా పొందామన్నారు. ఇప్పుడు ఆ భూమిని కాజేసేందుకు శేఖర్, సుధాకర్, చెంగయ్య అనే వ్యక్తులు తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. భూమి రికార్డులను శేఖర్ అనే వ్యక్తి తహసీల్దార్కు రూ.10లక్షలకుపైగా సొమ్ములిచ్చి రికార్డులనే మార్చేశారని వాపోయారు. దీనిపై తహసీల్దార్ను కలిసి జరిగిన విషయం చెప్పినా పట్టించుకోలేదని, అంతేకాక తమనే బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులు మంజుల, మౌనిక పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ



శ్రద్ధాంజలి ఘటిస్తున్న చెవిరెడ్డి మోహిత్రెడ్డి



బాధితులను ఓదారుస్తున్న చెవిరెడ్డి మోహిత్రెడ్డి

పాకాల : మండలంలోని పలువురికి చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్రెడ్డి పలువురిని పరామర్శించారు. ఆదివారం వైఎస్సార్సీపీ నేతలు, సానుభూతిపరుల ఇళ్లలో జరిగిన విషాదాలలో పాలు పంచుకున్నారు. ముందుగా సామిరెడిపల్లికి చేరుకున్న మోహిత్రెడ్డి పంచాయతీ అధ్యక్షుడు మహేశ్వర్రెడ్డి నానమ్మ లక్ష్మమ్మ కర్మక్రియలకు హాజరై ఆమె చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మద్దినాయనపల్లిలో వైఎస్సార్సీపీ నేత మధురెడ్డి అత్త కృష్ణమ్మ మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే గానుగపెంట చినపాపయ్యగారిపల్లికి చెందిన గాదంకి సర్పంచ్ నాగభూషణం సమీప బంధువు వీరిశెట్టి శ్యామల ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె కర్మక్రియలకు హాజరై ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో పయనిద్దాం

తిరుపతి కల్చరల్: మెకానిక్ వృత్తిలో నిరంతరం శ్రమిస్తున్న మెకానిక్ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని, అందరూ ఐక్యతతో ముందడుగు వేస్తూ అభివృద్ధి పథంలో పయనించాలని టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాయనేని ధర్మారావు పిలుపునిచ్చారు. నెలవారి సమావేశంలో భాగంగా దీపావళిని పురస్కరించుకుని తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గాంధీ భవన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరంలోని 200 మంది మెకానిక్ కార్మికులకు టపాకాయలు, స్వీటు, బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం 200 మంది మెకానిక్లకు టపాకాయలు, బియ్యం, నిత్యావసర సరుకుల్తో పాటు ప్రతి కార్మికుడికి అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.10 లక్షల ఇన్సూరెన్స్ పత్రాలు, గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రభు, గౌరవాధ్యక్షుడు జలంధర్, కార్యదర్శి గురు ఆచారి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, కోశాధికారి గౌసబాషా, కమిటీ ఇన్చార్జ్ కేశవ, మెకానిక్ కార్మికులు పాల్గొన్నారు.

తిరుచానూరు పవిత్రతను కాపాడండి

తిరుపతి కల్చరల్: తిరుచానూరు అమ్మవారి ఆలయం అధికారులు, విజిలెన్స్ సిబ్బంది, తిరుచానూరు పోలీసులు గత కొంతకాలంగా భక్తులతో దురుసు ప్రవర్తిస్తున్నారని, తిరుచానూరు పవిత్రతను కాపాడాలని హిందూ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మునిరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ప్రెస్క్లబ్లో మాట్లాడారు. తిరుచానూరు సీఐ వ్యవహారశైలి, మూడు రోజుల కిందట అమ్మవారి ఆలయ మహిళా జమేదారు ఓ భక్తున్ని చెంపపైన కొట్టి దాడి చేశారన్నారు. దీనిపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో ఆమెను ఇతర ప్రాంతానికి బదిలీ చేశారన్నారు.